క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న మోషేనురాజు

సాక్షి, భీమవరం : ప్రముఖ బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులను మంగళవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి విద్యనభ్యసిస్తే ఇంజనీరింగ్ విద్యార్థులు మాదిరిగా డిగ్రీ విద్యార్థులు కూడా మంచి ఉద్యోగావకాశాలు సాధించవచ్చునన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన పి.రిషిత, జి.భవానిలకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావూళ్ళు, ప్లేస్‌మెంట్స్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్స్ రవీంద్ర, బ్రహ్మం, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం



భీమవరం ఏఎస్ఎన్ రాజు బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం పట్టణంలోని ఏఎస్ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ బ్లడ్‌బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు రక్తదానం, రక్తదాతలకు సన్మానం , అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉండవల్లి రమేష్‌నాయుడు, చెరుకువాడ రంగసాయి, ఎ.వీరయ్య, బి.శ్రీనివాస్, డి.విజయ్, ఏఎస్ఎన్ రాజు, ఎం .రాజ్‌కుమార్, ఎ.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నింపే పనుల ప్రారంభం

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ మంచి నీటి చెరువును నింపే పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రారంభించారు. ప్రధాన పంట కాలువకు నీటిని విడుదల చేయడంతో కాలు వనుంచి మోటార్ల ద్వారా చెరువు లో నీటిని నింపే పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి భారీ విస్తీర్ణంలో చెరువు అందుబాటులోఉంది కాబట్టి 40 రోజులకు సరిపడా నీరు నిల్వఉంటుందని చెప్పారు. వేసవిలోకూడా రెండు పూటలా నీరు ఇవ్వగలిగామన్నారు. ఇప్పుడు కాలువ నుంచి మోటార్ల ద్వారా మంచినీటిని చెరువులోకి నింపుతున్నామని చెప్పారు. చెరువు నింపే పనులు త్వరితగతిన పూర్తి చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మల్లాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత

పెనుమంట్ర: మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల ద్వారా 4658 మంది రైతుల నుంచి 36422.92 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు రవాణా చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి అడబాల జోషిల మంగళవారం తెలిపారు. మండలంలో 35385 మెట్రిక్‌టన్నుల ధాన్యం లక్ష్యం కాగా లక్ష్యాన్ని అధిగమించి ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలు పూర్తయినందున మంగళవారం నుంచి కొనుగోలును నిలిపివేసినట్లు ఆమె తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా గ్రామ రైతులకు విత్తనాలు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి తెలిపారు. ఎంటీయూ 7029, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాల వరి విత్తనాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. వారికి కావాల్సిన విత్తనాలను సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

మట్టి తవ్వకాలపై అఖిలపక్ష సమావేశం

యలమంచిలి: చించినాడ పెరుగులంక భూమిలో మట్టి తవ్వకాలపై వివిధ పార్టీల నాయకులు మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. చించినాడ వై జంక్షన్ వద్ద జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తవ్వకాలు ఆపే వరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. అనంతరం పెరుగులంక పరిశీలించడానికి అఖిలపక్ష నాయకులు బయల్దేరగా, వారిని దారిలోనే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా పోలీసులను తోసుకుంటూ ముందుకు వెళ్లడానికి ప్రయత్నించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో పాటు అఖిలపక్ష నాయకులను, నిరసన కారులను అదుపులోనికి తీసుకుని పరిస్థితిని అదుపులోనికి తీసుకువచ్చారు.

అన్నదాతకు అండగా రైతు భరోసా కేంద్రాలు

- ఆర్‌బీకేల ద్వారా పల్లె వాకిట సేవలు
- అన్ని దశల్లోనూ రైతుకు చేయూత
- విత్తనం నుంచి విక్రయం వరకు రైతుకు అండ



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న రైతు భరోసా సిబ్బంది



పాలకోడేరు మండలం శృంగవృక్షంలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: ఇది రైతు ప్రభుత్వం అని పదే పదే చెప్పిన మన ముఖ్యమంత్రి చెప్పిన మాటలను ఆచరిస్తూ అడుగడుగునా నిరూపించు కుంటూ రైతన్నకు అండగా ఉంటున్నారు..ఇందు కోసం ప్రతి గ్రామం లోను ముందస్తుగా రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పారు. ఆరుగాలం కష్టించే రైతన్నకు వ్యవసాయ విజ్ఞానం అందించేందుకు ,అవసరమైన సలహాలు అందించేందుకు గాను, అగ్రికల్చరల్ అసిస్టెంట్లను నియమించారు. తొలుత ముందుగా విస్తీర్ణం ఎంత వుంది.? ఎలాంటి పంటలు పండిస్తే బాగుంటుందో తెలుసు కోవడం కోసం భూసార పరీక్షలు చేయిస్తున్నారు. ఏ భూమి ఏ పంటకు అనుకూలం అనే విషయాన్ని కూలంకషంగా నిర్ధారించి, తదనుగుణంగా ఆయా రైతాంగానికి అవగాహన కల్పించి, విత్తనం నాటినప్పటి నుంచి పెట్టుబడిని రైతు భరోసా పేరిట ఇప్పించి, రైతన్నకు అండగా నిలిచారు

జిల్లాలో సాగు ఇలా

పశ్చిమగోదావరి జిల్లాలో ఖరీఫ్ కు 2 లక్షల 40 వేల 117ఎకరాలు, రబీకు 2 లక్షల42 వేల 960 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. అధికంగా వరి, చెరకు కూరగాయలు పండిస్తారు. 1137.50 ఎకరాలు సాగులో ఉంది. 1.30 లక్షల మంది రైతులు ఈ రకమైన పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు అలాగే పాడి పరిశ్రమకు సంబంధించి పశువులు (గేదెలు ఆవులు) 2లక్షల 17వేలు, గొర్ మేకలు 61వేలు, పెరటి, నాటు కోళ్లు 5 లక్షల 19వేల 502ఉన్నాయి.వీటి ఆధారంగా 87 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. వీరికి అండగా 387 రైతు భరోసా కేంద్రాలు నడుస్తున్నాయి.

ప్రతిదశలోనూ అండ

రైతు భరోసా కేంద్రాల్లో సేవలు ఇలా పల్లెకు రైతు భరోసా కేంద్రాలు వచ్చాక దుక్కు దున్నడం దగ్గర నుంచి పంట పండించే వరకు అండగా ఉంటుంది. తొలుత భూసార పరీక్షలు చేయించి ఆ భూములో ఏ రకమైన పంటలు పండించాలో వ్యవసాయశాఖ సిబ్బంది నిర్ధారిస్తున్నారు. నిర్ణీత సమయంలో రైతు ఖాతాకు పెట్టుబడి సాయం (రైతు భరోసా)జమ అవుతోంది. దుక్కులు కావాల్సిన యంత్ర పరికరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ట్రాక్టర్లు, రోటవేటర్లు, వరి కోత మెషీన్లు, వ్యవసాయ పనిముట్లు రాయితీతో ఇస్తున్నారు. అవసరాన్ని బట్టి రైతుకు వరి, మొక్కజొన్న, పచ్చిరొట్ట అపరాలు తదితర ఇలా పలు రకాల విత్తనాలను రాయితీ, ఉచితంగా కూడా అందిస్తున్నారు. హార్టికల్చర్‌లో భాగంగా పలు రకాల పండ్ల తోటలను పెంపకానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తుంది. తర్వాత విత్తన శుద్ధి మందులను సరఫరా చేస్తుంది. పంట సాగులో అవసరమైన యూరియా, డీఏపీపొటాషియం కాంప్లెక్స్ మందులు కేంద్రాల్లో రైతులుకు అందేలాప్రభుత్వం సదుపాయం కల్పించింది. ఏటా యూరియా 28 వేల 102 మెట్రిక్ టన్నులు, డిఏపి 13వేల 747 మెట్రిక్ టన్నులు, పొటాషియం 5వేల 908 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 68 వేల 116 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 5వేల 454 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం నుంచి రైతులు కావాల్సిన ఎరువులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. గతంలో రైతులు ఈ ఎరువులు కోసం పొలం పనులు మానుకుని భీమవరం తాడేపల్లిగూడెం తణుకు తదితర పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. నాణ్యత లేవని జిల్లాలు దాటి వెళ్లి ఎరువులు పురుగు మందులు తెచ్చుకునేవారు. దీంతో రవాణా చార్జీలు రైతులకు భారంగా మారేవి. కొంతమంది రైతులుపురుగులు మందుల వ్యాపారుల దగ్గరకు వెళ్లి వడ్డీకి కొనుక్కొని తెచ్చుకునేవారు. రైతుకు భరోసా కేంద్రాలు వచ్చాక బయట కొనుగోళ్లకు బ్రేకులు పడ్డాయి. కేంద్రాల్లో అందించే ఎరువులు, రసాయన మందులు నిర్ణీత ధర నాణ్యత పరంగా బాగుండడంతో రైతులు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు రైతుకు భూసార పరీక్షలు చేయడం మొదలు విత్తన శుద్ధి, పంట సాగు, తెగుళ్ల నివారణ అధిక దిగుబడి కావాల్సిన సూచనలు సలహాలు అందించేందుకు నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు సాగైన పంటలకు ఈ క్రాఫ్ బుకింగ్ చేయిస్తూ పంట నష్టపోతే నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటుంది.

పాడి పరిశ్రమ వృద్ధి

రంగంతో పాటు పాడి పరిశ్రమ వృద్ధికి కూడా ప్రభుత్వం కృషి చేస్తుంది ప్రతి రైతు భరోసా కేంద్రానికి పశుసంవర్ధక కార్యదర్శిని నియమించింది. వీటి ద్వారా పాడి పరిశ్రమను కాపాడుకుంటూ వృద్ధి రేటు పాల ఉత్పత్తి పెంచేలా చూస్తుంది. పశువులకు సీజనల్ గా వచ్చే వ్యాధు లపై అప్రమత్తం చేస్తూ ఉచితంగా నివారణ టీకాలు చేయిస్తుంది. పశు బీమా కల్పిస్తుంది. పురుగుమందులను ఉచితంగా అందిస్తుంది. రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్నారు.

774 శాంపిల్స్ పంపించాం



ఈ ఏడాది ఇప్పటికే 774 శాంపిల్స్ తీసి మట్టి పరిశోధనా కేంద్రానికి పంపించాం. గవర్నమెంట్ పోర్టల్‌లో తెలియపరిచే విధంగా ఈ పరీక్షలు నిర్వహిస్తుంది. మట్టి ఏ విధంగా ఆన్‌లైన్ పరీక్షలు చేస్తున్నారో? తెలుసుకోవచ్చు. ఇంకా 4 వేల భూసార పరీక్షలు చేయాల్సి ఉంది. వరి తదితర పంటలకు సంబంధించిన విత్తనాలు 1737 క్వింటాళ్ల రైతులకు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 344 రైతు గ్రూపులకు సంబంధించి రూ.27.54 కోట్ల యంత్ర పరికరాలు రైతులకు రాయితీతో అందించాం. – వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ

మా ఊళ్లోనే విత్తనాలు ఇస్తున్నారు



మాకు 80 సెంట్ల సొంత పొలంతోపాటు 8 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. గతంలో వేరేచోటకి వెళ్లి విత్తనాలు, ఎరువులు తెచ్చుకునే వాళ్లం. రైతు భరోసా కేంద్రం వచ్చాక మా గ్రామంలోనే విత్తనాలు ఇస్తున్నారు. ఎరువులు కావాలంటే ఆర్డర్ పెట్టి తెప్పించి ఇస్తున్నారు. – దుండి పెద్దిరాజు, రైతు, శృంగవృక్షం

గ్రామంలోనే దొరుకుతున్నాయి



నేను చదువుకుని వ్యవసాయం చేస్తున్నాను. సొంత పొలం 9 ఎకరాలు ఉంది. వరి సాగు చేస్తున్నాను. కావాల్సిన విత్తనాలు ఆర్‌బీకేలో దొరుకుతున్నాయి. గతంలో విత్తనాలు మార్టేరు తదితర ప్రాంతాల నుంచి తెచ్చుకునే వాళ్లం. ముఖ్యంగా ఎరువులు కావాలంటే వ్యాపారులను ఆశ్రయించే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. -కె.అప్పారావు, రైతు, మొగల్లు

సీఎం జగన్‌తోనే ప్రభుత్వ పాఠశాలలకు నూతన శోభ



తాడేరు హైస్కూల్లో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



రాయకుదురు జెడ్పీ హైస్కూల్లో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



చిలుకూరులో జగనన్న విద్యాకానుక అందిస్తున్న సర్పంచ్ వెంకటసోమరాజు

భీమవరం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి వల్లనే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు అన్నారు. భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో జిల్లాపరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని తలచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది కోట్లు ఖర్చు పెట్టి నాడు–నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాఠశాలలు అభివృద్ధి చేయకుండా కమీషన్ల కోసం కక్కుర్తిపడి కార్పొరేట్ పాఠశాలలకు రెడ్ కార్పెట్ పరిచారని విమర్శించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను నాడు–నేడు పథకంలో పెద్దెత్తున అభివృద్ధి చేస్తున్నారన్నారు. పార్టీ యువజన విభాగం నాయకులు నామన మహేష్ మాట్లాడుతూ పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, విద్యాకానుక లాంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం 2022–2023 విద్యాసంవత్సరంలో మండలంలో పదిలో మండల ప్రథమ స్థానంలో నిలబెట్టిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావాడ సింహాద్రి, సంబల దీవి వినాయక, గూడపాటి పెద్దిరాజు, బేతపూడి లోకేష్, షేక్ షాన్ భాషా, వీరుడు, నామన నాని, ఉపాధ్యాయులు గెడ్డం మాణిక్యాలరావు, అంజిబాబు, సోమయ్య, సంజీవరెడ్డి, విజయ్‌కుమార్, సునంద, రాజేశ్వరి, కాంతకుమారి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం : జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీరవాసరంతో పాటు రాయకుదురు, చింతలకోటిగరువు, తోకలపూడి, బలుసు గొయ్యలపాలెం, నవుడూరు, అండలూరు తదితర గ్రామాల్లోని పాఠశాలలోని విద్యార్థులకు కిట్లను అందజేశారు.

ఉండి: ప్రభుత్వ విద్యా ప్రమాణాలను దేశానికే తలమానికంగా మార్చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చిలుకూరు సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు అన్నారు.మంగళవారం ఉండి మండలం చిలుకూరు ఎంపీపీ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను సర్పంచ్ స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సర్పంచ్ మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు విద్యార్థులకు అన్ని పథకాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ముందుకు నడిపించారన్నారు. కానీ ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను తలదన్నుతూ ఇంగ్లిషు మీడియంలో ప్రభుత్వ విద్యా విధానం చాలా గొప్పగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.డేవిడ్‌రాజు, పేరెంట్స్‌కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా



వీరవాసరంలో ధర్నా చేస్తున్న దృశ్యం

వీరవాసరం : వీరవాసరం మండలంలో రైస్ మిల్ కార్మికులు అంగన్‌వాడీ, ఆశ, మిడ్డేమీలు, వీవోఏ, పంచాయతీ కార్మికులు, వీఆర్ఏ, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల కార్మికులు, స్కీమ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు డి.వరలక్ష్మి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి పి.నాగరత్నం, ఆయా సంఘాల నాయకులు కె.సత్తిబాబు, లక్ష్మి, నిర్మల ,ప్రదీప్ మల్లుల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ అహ్మద్ ఖాన్

భీమవరం (ప్రకాశంచౌక్) : విద్యుత్ శాఖ పని చేసే క్షేత్రస్థాయి సిబ్బంది నిర్దేశిత భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని దీంతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చునని విద్యుత్ పంపిణీ సంస్థ భీమవరం ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. మంగళవారం ఇండస్ట్రీయల్ ఎస్టేట్లోని భీమవరం డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఏఈలు, క్షేత్ర సహాయ సిబ్బంది, షిఫ్ట్ ఆపరేటర్లు మరమ్మతులు చేసే సమయంలో హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు వినిగించాలని, స్తంభాలపై ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. అలాగే విద్యుత్ వినియోగదారులకు, ప్రజలకు కూడా విద్యుత్ పరివర్తకాలపై అవగాహన కలిగించాలన్నారు. గాలివానకు వర్షాకాలంలో ఎప్పుడైనా వైర్లు తెగిపోయిన, విద్యుత్ పరివర్తకముల దగ్గర ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రాజగోపాల్ చౌదరి, ఏఈలు పి శ్రీనివాసరాజు, పి.పద్మశ్రీ, పి.శ్రీనివాసరావు, బి.నర్సయ్య, ఆర్‌వీ అప్పారావు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ శాఖలో పనిచేసే సిబ్బంది భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని నరసాపురం డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాలకొల్లు ఎలక్ట్రిషియన్స్ అసోసియేషన్ భవనంలో విద్యుత్ భద్రతా ప్రమాణాలపై శిక్షణ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ శిరస్త్రాణం, సేఫ్టిబెల్టులు, ఎర్త్ రాడ్స్, గమ్ బూట్స్, రాత్రి వేళల్లో టార్చ్‌లైట్లు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ చంద్రశేఖర్, ఆర్. నాగేశ్వరరావు, ఎస్‌కె బాబ్జి, ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరుకుమిల్లిలో వేగంగా ఇళ్ల నిర్మాణాలు



చెరుకుమిల్లి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. గ్రామంలోని 71 మంది నిరుపేదలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో 40 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. చాలా ఇళ్లు శ్లాబ్ లెవెల్‌కు వచ్చాయి. మరి కొన్ని వివిధ దశల్లో ఉండగా, నాలుగు ఇళ్లల్లో గృహ ప్రవేశాలు జరిగాయి. కాలనీలో గ్రావెల్ రహదారుల నిర్మాణం జరిగింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే నీటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పంచాయతీ ద్వారా పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేసినట్లు సర్పంచ్ నందమూరి ప్రకాశం చెప్పారు. విద్యుద్దీకరణ కోసం స్తంభాలను దిగుమతి చేశారు. తాత్కాలిక మీటర్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు.

ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన

నరసాపురం: తమ చిన్నపాటి ఉద్యోగాలను పర్మినెంట్ చేసి జీతాలు పెంచాలని స్కూల్ స్వీపర్లు, ఆయాలు కోరారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంవద్ద స్వీపర్లు ఆందో ళన చేశారు. ఈ సందర్భంగా స్కూల్ స్వీపర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసిందన్నారు. స్కూల్ స్వీపర్లుగా గత 2 ఏళ్లుగా పనిచేస్తున్న తమను పర్మినెంట్‌చేయాలని కోరుతున్నామన్నా రు. జి.సూర్యలక్ష్మి, ఈ.భారతి, సాధనాల మణి పాల్గొన్నారు.

ప్రతి హామీనీ నిలబెట్టుకుంటున్న సీఎం జగన్



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో కలిసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పెనుగొండ: ప్రజా సంకల్ప యాత్రలోనూ,ఎన్నికల మెనిఫెస్టోలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆనాడు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి క్యాబినేట్ అంగీకరించినందుకు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగులు సంఘ జిల్లా నాయకులు తూర్పుపాలెంలో కలసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బడుగు, బలహీన, దళిత, అగ్రవర్ణ పేదలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు, ఉద్యోగులకూ అండగా నిలిచిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు.

డ్రెయిన్ పనుల పరిశీలన

సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రయిన్ ప్రక్షాళన పనులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మంగళవారం పరిశీలించారు. ప్రక్షాళన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పార్టీ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్, కుడిపూడి రామకృష్ణ, చింతపల్లి ప్రసాద్, వీఆర్వో ఏసుబాబు పాల్గొన్నారు.

ఉండి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎస్‌వీఎస్ నాయుడు

ఉండి: ఉండి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎస్‌వీఎస్ నాయుడు బాధ్యతలు మంగళవారం చేపట్టారు. గతంలో ఇదే స్థానంలో తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రవీంద్రకుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా నరసాపురం బదిలీ కావడంతో క్కడ ఖాళీ ఏర్పడింది. దీంతో ఎలక్షన్ డీటీగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌వీఎస్ నాయుడును ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన



జన భగీదారి కార్యక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కాళ్ల: పిల్లల జీవితంలో మొదటి 6 సంవత్సరాలు అత్యంత విలువైనవని మూడేళ్ల వరకూ తల్లి ఒడికి ఇంటికి పరిమితమైన పిల్లలు తర్వాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాన్ని మొదలు పెడతారని అంగన్‌వాడీ టీచర్ ఝాన్సీ తెలిపారు. కాళ్ల అంగన్వాడీ కేంద్రంలో జన భగీదారి కార్యక్రమం మంగళవారం ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులకు పిల్లలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని పెండ్లి కొడుకుగానూ, అమ్మవార్లను పెండ్లి కూమార్తెగా అలంకరించి పూజలు చేశారు. స్వామి వార్ల కల్యాణోత్సవం బుధవారం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్ని అర్చకులు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

జూదరుల అరెస్ట్

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం గ్రామ శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 4,800లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొగల్తూరు: రోడ్డుపై పడి గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం .వీరబాబు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మొగల్తూరు సత్రవుపాలెంకు చెందిన దొంగ సత్యనారాయణ (65) మంగళవారం వేకువజామున ఇదే పంచాయతీ పడమటిపాలెంలోని పొలానికి వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తున్నాడన్నారు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తూ పడడంతో తలకు తీవ్ర గాయమైందన్నారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు భీమవరం తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందాడన్నారు. మృతుని కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

నరసాపురం: సచివాలయ వ్యవస్థ లక్ష్యాలకు తగ్గట్టుగా సిబ్బంది పనిచేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. మంగళవారం ముదునూరి పట్టణంలోని 14వవార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, అక్కడందుతున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయం బయట కచ్చితంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు డిస్‌ప్లే బోర్డుల్లో ఉంచాలని చెప్పారు. ఇరుకుగదిలో కార్యాలయం ఉన్న దృష్ట్యా వేరే చోటకు మార్చాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ఆదేశించారు.